
చెరుకువారిపల్లి ప్రాజెక్టు (చిత్తూరు జిల్లా)కు 20 లక్షలు చొప్పున నిధులను అందజేస్తున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్


ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని సమక్షంలో ప్రమాణ స్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

నిధులు సిద్ధం.. అభివృద్ధి చేసుకోండి

- కమిటీల ప్రమాణ స్వీకారోత్సవంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

జగన్ రోగానికి ప్రపంచంలో ఎక్కడా మందులు లేవు : యరపతినేని

పిడుగురాళ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో గ్రామ, వార్డు, క్లస్టర్, మండల, నియోజకవర్గ స్థాయి కమిటీల్లో పదవులు పొందిన వారు మంగళవారం పిడుగురాళ్ల మార్కెట్ యార్డులో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కూటమి హయాంలో గ్రామాలను అభివృద్ధి బాటలో తీసుకొచ్చేందుకు సహకారం అందిస్తామన్నారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్‌కు ఉన్న రోగానికి ప్రపంచంలో ఎక్కడా మందులు లేవన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న చంద్రబాబును చూసి ఓర్వలేని వైసీపీ నేతలు విషప్రచారాన్ని ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ పదవులు పొందిన ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేస్తూ అటు ప్రజల్లోనూ, ఇటు పార్టీలోనూ గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు విజయభాస్కరరెడ్డి, కన్వీనర్లు గండికోట వెంకటేశ్వర్లు, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, బడిగుంచల వెంకటేశ్వర్లు, బొమ్మిరెడ్డి నారాయణ, పిల్లి చెన్నారావు, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్లు తురకా వీరస్వామి, బెల్లంకొండ భారతి భద్రి, బొల్లా శ్రీను, పాండురంగ శ్రీను, కనిగిరి శ్రీను, వడ్డవల్లి సాంబశివరావు, పణితి రవి, దియ్యా రామకృష్ణ, కూరపాటి హనుమంతరావు, పాదర్తి రాజేశ్వరి, చల్లగుండ్ల సీత, కొంకా రాధ, ఈదర అనురాధ, ఎల్‌వీఆర్, వున్నం సురేష్, ముప్పాళ్ల సాంబయ్య, దేవళ్ల రాంబాబు, కోట హరి, మందా డేవిడ్, అనబోతుల యలమందారెడ్డి, నంద్యాల వెంకటేశ్వరరెడ్డి, సయ్యద్ అమీర్‌అలి తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైల్లో న్యాయమూర్తి ఆకస్మిక తనిఖీలు


జైలును పరిశీలిస్తున్న న్యాయమూర్తి జియావుద్దీన్

వినుకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వినుకొండ సబ్ జైలును గుంటూరు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ సయ్యద్ జియావుద్దీన్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితులను, జైలులో అందిస్తున్న భోజన సదుపాయాలు గురించి ఆరా తీశారు. జైలులో ఏమైనా ఇబ్బందులుంటే తెలియ జేయాలని తెలిపారు. జైలులో అందిస్తున్న మెనూను పరిశీలించారు. వైద్యం, భోజనం, తదితర విషయాల గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. వంట గది, స్టోర్ రూమ్‌లను తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని వారికి న్యాయవాదిని నియమి స్తామని, ఎవరికైనా న్యాయ సహాయం కావాలంటే తెలియజేయాలన్నారు. ఆయనతో పాటు వినుకొండ బార్ అసోసియేషన్ సభ్యులు, జైలు సిబ్బంది ఉన్నారు.

ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకం : ఎస్పీ కృష్ణారావు

నరసరావుపేట లీగల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి), స్వాతంత్ర్య సమరయోదుడిగా, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని ఎస్పీ కృష్ణారావు తెలిపారు. మౌలానా జయంతిని మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ కృష్ణారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత దేశ చరిత్రలో అజరామరమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అన్నారు. విద్య, సాహిత్యం, సామాజిక రంగాలకు ఆయన ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ సంతోష్, వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.


ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ కృష్ణారావు

మట్టి, జలంతోనే మనుగడ



- వాటి పరిరక్షణకే వాటర్‌షెడ్ కార్యక్రమం
- ఆరోగ్యం, ఆహ్లాదం, ఆదాయం సూత్రంతో రూపకల్పన
- వెంగళాయపాలెం నమూనాగా మరిన్ని చెరువుల అభివృద్ధి
- వాటర్‌షెడ్ మహోత్సవంలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్


సభకు హాజరైన మహిళలు, కార్యకర్తలు


అభివృద్ధి చేసిన వెంగళాయపాలెం చెరువును ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్ పెమ్మసాని , మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే బూర్ల


అభివృద్ధి చేసిన చెరువులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రులు

గుంటూరు(తూర్పు), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవన మనుగడకు మట్టి, జలాలే ముఖ్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. వాటర్‌షెడ్ మహోత్సవ్ పై గుంటూరులో రెండు రోజుల జాతీయ సదస్సు విజయవంతంగా జరిగింది. రెండో రోజు మంగళవారం గుంటూరు మండలం వెంగళాయపాలెం లయోలా పాఠశాలలో వాటర్‌షెడ్ మహోత్సవంలో శివరాజ్‌సింగ్ చౌహాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జలం, మట్టి పరిరక్షణే వాటర్‌షెడ్ ముఖ్య ఉద్దేశమన్నారు. జల సంరక్షణ కార్యక్రమాలతో భూగర్భ జలాలు పెరగడమే గాక మట్టి సారవంతంగా మారుతుందని చెప్పారు. జల సంరక్షణ కార్యక్రమాలు సుస్థిర ఆర్థిక వ్యవస్థకు దోహదం చేస్తాయన్నారు. వెంగళాయపాలెం చెరువు నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. వీటి ద్వారా ప్రజలకు మంచి ఆరోగ్యం, సాంస్కృతిక వికాసానికి దోహదం అవుతుందని చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస యోజన కింద ప్రతి ఒక్కరూ పక్కా గృహం కలిగి ఉండాలని ప్రభుత్వం భావిస్తోందని, ఇందుకు కలెక్టర్, ఎమ్మెల్యేలు సర్వే నిర్వహించి ఏ ఒక్కరూ గుడిసెల్లో ఉండకుండా చూడాలన్నారు. గతంలో రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలకు పెమ్మసాని అడిగిన రూ.380 కోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు.

వెంగళాయపాలెం చెరువు ప్రారంభం

వాటర్‌షెడ్ మహోత్సవ్‌లో తొలుత రూ.1.20 కోట్లతో అభివృద్ధి చేసిన వెంగళాయపాలెం చెరువును కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రారంభించారు. చెరువు వద్ద విఘ్నేశ్వరుడు, పోలేరమ్మ అమ్మవారి, ఆలయాన్ని వారు దర్శించుకున్నారు. నక్షత్ర వనంలో మొక్కలను నాటారు. వాకింగ్ ట్రాక్ పై నడిచి పరిశీలించారు. పునరుద్ధరించిన బావిని, చిన్నారులకు ఏర్పాటు చేసిన పార్కు, ఓపెన్ జిమ్, సిమెంట్ బెంచీలను, ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను పరిశీలించారు. ఢిల్లీ దుర్ఘటన నేపథ్యంలో వెంగళాయపాలెంలో నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన బైక్, కార్ల ర్యాలీని (మిగతా 7వ పేజీలో)



చెరువుల అభివృద్ధికి చర్యలు

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

దేశంలో పురాతన నీటి చెరువుల అభివృద్ధితో పాటు నూతనంగా చెరువులను తవ్వుతామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. వాటర్‌షెడ్ మిషన్ కింద చెక్‌డ్యాంలు, స్టాక్ డ్యాంలు వంటి నీటి వనరులు పునరుద్ధరణ జరిగాయన్నారు. దీంతో రైతులకు ఎంతో లబ్ధి చేకూరిందన్నారు. వెంగళాయపాలెం చెరువులో కొబ్బరిచెట్లు, చేపలు, బాతుల పెంపకంతో గ్రామానికి ఏడాదికి రూ.5 లక్షలు ఆదాయం సమకూరుతుందన్నారు.



భూగర్భ జలాల రక్షణ

మంత్రి కందుల దుర్గేష్

భూగర్భ జలాలను రక్షించుకునేందుకు బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించినట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గతంలోనే నీటిని పరిరక్షించుకునేందుకు చంద్రబాబు ఇంకుడు గుంతలు కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా సాగు భూములకు నీరు అందించేందుకు పవన్‌కల్యాణ్ ఆలోచనలకు ఈ పథకం తోడ్పడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ భూ వనరుల విభాగం కార్యదర్శి మనోజ్‌జోషి మాట్లా డుతూ వాటర్‌షెడ్ కార్యక్రమాలతో భూగర్భ జలాలు మూడు మీటర్లు వరకు పెరిగాయన్నారు.

ఎండిపోతున్న వరి



- లబోదిబోమంటున్న అన్నదాతలు
- విద్యుత్ స్తంభాల పునరుద్ధరణలో జాప్యం

వినుకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం.. అన్నదాతల పాలిట శాపంగా మారింది. మొంథా తుఫాన్ ప్రభావంతో అనేక ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు నష్టం వాటిల్లింది. అయితే రోజులు గడుస్తున్నా వాటి పునరుద్ధరణ జరగలేదు. అతివృష్టి, అనావృష్టితో రైతులు నష్టపోతున్నారు. మరికొందరు రైతులు సకాలంలో నీరు అందించలేకపోవడంతో ఎండిపోయిన పైర్లతో నష్టపోతున్నారు. గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలో మండలంలోని ఉమ్మడివరం, పిట్టంబండ తదితర గ్రామాల రైతులు పైర్లు సాగు చేస్తున్నారు. ఆయా పైర్లకు విద్యుత్ మోటర్ల ద్వారా సాగునీరు అందిస్తుంటారు. అయితే ఇటీవల తుఫాన్ కారణంగా గాలులకు పొలాల్లోని ట్రాన్స్‌ఫారాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఆ ప్రాంతంలోని సుమారు 100 ఎకరాల్లో వరి పొలాలకు నీరు అందక ఎండిపోతున్నాయి. దీంతో కళ్లెదుట పైర్లు ఎండి పోతుండటంతో రైతులు కన్నీ టి పర్యంతమవుతున్నారు. అధికారులు వెంటనే విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరిస్తే పంటలను కాపాడుకుంటామని తెలుపుతున్నారు.


నీరు లేక బీటలు వారిన వరి పంట పొలం

పారిశ్రామికంగా.. పరుగులు

పరిశ్రమలకు ఆహ్వానం

నడికూడిలో ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి: గత ప్రభుత్వం పరిశ్రమలను తరిమికొడితే కూటమి ప్రభుత్వం పరిశ్రమలను ఆహ్వానిస్తుందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. కనిగిరి నుంచి వర్చువల్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు నడికూడిలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ పరిశ్రమలతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంతో పనిచేస్తుందన్నారు. 2.91 ఎకరాల్లో రూ.15 కోట్లతో ఏర్పాటు చేయనున్న పారిశ్రామిక వాడలో ఒక్కొక్కరికి 2 సెంట్లు చొప్పున కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, తహసీల్దారు శ్రీనివాస్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, డీటీ బ్రహ్మయ్య, కూటమి నేతలు పాల్గొన్నారు.


వర్చువల్ కాన్ఫరెన్స్‌కు హాజరైన ఎమ్మెల్యే యరపతినేని, ఆర్డీవో మురళి

- పరిశ్రమల ఏర్పాటు దిశగా అడుగులు
- నాలుగు నియోజకవర్గాల్లో 137 ఎకరాలు కేటాయింపు
- రెండు ఎంఎస్ఎంఈలకు వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పారిశ్రామిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఎక్కడికక్కడ పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టింది. పలు నియోజకవర్గాల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ(ఎంఎస్ఎంఈ) పార్కులు నెలకొల్పుతున్నారు. జిల్లాలో సత్తెనపల్లి, మాచర్ల, గురజాల, వినుకొండ నియోజకవర్గాల పరిధిలోని పారిశ్రామికవాడలకు 137 ఎకరాలు (మిగతా 7వ పేజీలో)



పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు

- గుండ్లపల్లి పారిశ్రామికవాడకు భూమిపూజ
- హాజరైన కలెక్టర్ కృతికాశుక్లా, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు: ఎక్కడికక్కడ పరిశ్రమల ఏర్పాటుతో యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. మండలంలోని గుండ్లపల్లిలో ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ పార్కును వర్చువల్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ప్రారంభించారు. కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ భూమిపూజ చేశారు. దీంతో 27 ఎకరాల విస్తీర్ణంలో రూ.9 కోట్ల అంచనాతో పారిశ్రామికవాడ ఏర్పాటుకు ముందడుగు పడింది. ముఖ్యమంత్రి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని, ఆయన ప్రసంగాన్ని వీక్షించేందుకు వీలుగా ఏపీఐఐసీ అధికారులు డిజిటల్ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జీ రమణకాంత్‌రెడ్డి, ఇండస్ట్రీస్ జీఎం నవీన్‌కుమార్, ఏపీఐఐసీ ఇంజనీర్లు మేకల సుధీర్, అనూష, తహసీల్దారు పుల్లారావు, ఎంపీపీ మేచారపు అనురాధ, ఎంపీడీవో కాశయ్య, నాగోతు శౌరయ్య, పూజల వెంకట కోటయ్య, షేక్ అలీ బాషా, ఏటీ సుచరిత తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలే పరిష్కారం



వెంగళాయపాలెం చెరువు వద్ద మొక్క నాటి నీరు పోస్తున్న కేంద్రమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, పెమ్మసాని

- ఏటా ఎన్నికలతో సమయం, డబ్బు వృథా!
- ఐదేళ్లలో ఒకసారే ఎన్నికలు జరగాలి
- రోజువారీ అవసరాలకు స్వదేశీ వస్తువులనే కొనండి
- మంగళగిరి చీరలు, వస్త్రాలు అద్భుతం
- ఆత్మనిర్భర్ భారత్ సభలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

గుంటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 'ఏటా రెండు సార్లు ఎన్నికలు వస్తున్నాయి. ఐదేళ్లలో పదిసార్లు.. ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల కోసం ప్రధాని మోదీ.. మాలాంటి మంత్రులు ఎంతో సమయం వెచ్చించాల్సి వస్తోంది. అదే సమయం ప్రజల కోసం వెచ్చిస్తే.. ఎంత బాగుంటుంది. ఇలా నిరంతరం ఎన్నికలు రావడం వల్ల మా సమయమే కాదు, అధికారులు, ప్రజల సమయం, డబ్బు ఎంతో వృథా అవుతోంది. ఎన్నికల కోడ్ కారణంగా అభివృద్ధి ఆగిపోతోంది. అదే ఐదేళ్లలో ఎన్నికలు ఒకేసారి జరిగితే.. ఎంత మేలు జరుగుతుంది? ఎంత సమయం, డబ్బు ఆదా అవుతుంది? ఆలోచించండి. అందుకే ప్రధాని మోదీ, మంత్రులు దీనిపై ఒక ఆలోచన చేశాం. దేశ పార్లమెంటుకు, రాష్ట్ర అసెంబ్లీలకు ఐదేళ్లలో ఒకసారే ఎన్నికలు జరిగేలా జమిలి ఎన్నికలు తీసుకురావాలని భావించాం' అంటూ కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ స్పష్టంచేశారు. గుంటూరులోని ఎల్‌వీఆర్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన 'ఆత్మనిర్భర్ భారత్ సంకల్ప అభియాన్' నగర ప్రముఖుల సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయనతోపాటు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షత వహించిన ఈ సమ్మేళనంలో మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ దేశం స్వధర్మం, స్వదేశీ అనే లక్ష్యంతో దేశాన్ని స్వావలంబన దిశగా నిలపడమే ఆత్మనిర్భర్ భారత్ ముఖ్య ఉద్దేశ మన్నారు. సనాతన, నిత్యనూతన భావాలను జోడించి ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మిస్తున్నామ న్నారు. వాజపేయి ప్రధానిగా ఉన్న సమ యంలో



వెంగళాయపాలెం చెరువు వద్ద బావిలో నీరు తోడుతున్న కేంద్రమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, పెమ్మసాని, రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్ తదితరులు



గుంటూరు : శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను సన్మానిస్తున్న ఎల్‌వీఆర్ క్లబ్ సభ్యులు

పోఖ్రాన్ అణు పరీక్ష మొదలు మోదీ ప్రధాని అయ్యాక దేశ రక్షణ వ్యవస్థ స్వావ లంబన సాధించిందన్నారు. అంతరిక్ష రంగంలో స్వదేశీ పరిజ్ఞానంతో మంగళయాన్ విజయ వంతం చేసుకొని దీటుగా నిలిచామన్నారు. ఇప్పుడు ప్రపంచ నాలుగో ఆర్థిక వ్యవస్థగా అవతరించి, దేశాన్ని పాలించిన యూకేను కూడా వెనక్కి నెట్టామని, మూడో ఆర్థిక వ్యవస్థగా అవతరించ బోతున్నామన్నారు. ఇదంతా ప్రధాని మోదీ కృషిలో భాగమేనని, అందుకే ప్రపంచం నలుమూలల నుంచి మోదీ పేరు మారుమోగుతోందన్నారు. దేశంపై టారిఫ్‌ల మోత మోగిపోతున్నా దీటుగా ఎదుర్కోగలుగుతున్నామన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా దేశీయ ఉత్పత్తులను, దేశంలోని మేధోవంతమైన యువశక్తిని ప్రోత్సహించాలనుకుంటున్నాం. నా సహ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లాంటి యువకుల అపార శక్తి ఆత్మ నిర్భర్ భారత్ ద్వారా దేశానికి ఉపయోగపడేలా చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ తమ రోజు వారీ అవసరాల కోసం దేశీయ ఉత్పత్తులనే వినియో గించాలని కోరారు. బీహార్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయ దుందుభి మోగించబోతున్నామని చెప్పారు. ఇండియా కూటమికి అభివృద్ధి నినాదం లేక వారు ఓట్ చోరీ నినాదంతో ఎన్నికలకు వెళ్లారని చెప్పారు. బీహార్‌లో అభివృద్ధి ప్రభుత్వమే మళ్లీ అధికారం చేపట్టబోతోందన్నారు. నాడు జాతిని సమైక్యపరిచిన వందేమాతర గీతాన్ని కాంగ్రెస్ నిషేధించి దేశ విభజనకు బీజం వేసిందన్నారు. ఆ నష్టం ఇంకా కొనసాగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మంగళగిరి చీరల గురించి ప్రస్తావించారు. మంగళగిరి చీరలు, వస్త్రాలు ఎంత అద్భుతంగా ఉంటాయో తెలుసా.. అంత అద్భుతమైన ఉత్పత్తులు కేవలం దేశంలోనే తయారవుతున్నాయని కొనియాడారు.

బాబు- మోదీ.. వన్ ప్లస్ వన్ లెవెన్..

రాష్ట్రంలో మోదీ-చంద్రబాబు-పవన్ కల్యాణ్ కలయిక నిజమైన ఎన్డీఏ కూటమి స్ఫూర్తికి నిదర్శనమన్నారు. అదో అద్భుతమైన కలయికగా అభివర్ణించారు. మోదీ- బాబు ద్వయం వన్ ప్లస్ వన్ అంటే రెండు కాదని, వన్ ప్లస్ వన్ లెవెన్ అని, విజనరీ లీ డర్ చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం పదకొం డింతల అభివృద్ధిని సాధించబోతోందని చెప్పా రు. మొంథా తుఫాను నష్టంపై కేంద్ర వ్యవ సాయ శాఖ విచారించి తగిన న్యాయం జరగేలా చూస్తానని శివరాజ్‌సింగ్ చౌహాన్ హామీ ఇచ్చారు.

వాటర్ షెడ్ సదస్సు సక్సెస్

- వెంగళాయపాలెం చెరువును చూసి ప్రతినిధుల ఆశ్చర్యం

గుంటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వాటర్ షెడ్ జాతీయ సదస్సును గుంటూరు గ్రామీణాభివృద్ధిశాఖ సహకారంతో జిల్లా యంత్రాంగం విజయవంతంగా నిర్వహించింది. కేవలం 15 రోజుల వ్యవధిలోనే ఒక పాడుపడిన చెరువును పునరుద్ధరించి తీర్చిదిద్దింది. ఇందుకోసం అహర్నిశలు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ కమిటీ నాయకులు శ్రమించారు. కీలకమైన సదస్సును ఐటీసీ వెల్‌కం హోటల్‌లో, బహిరంగ సభను నల్లపాడు లయోల పబ్లిక్ స్కూల్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించింది. సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వాటర్ షెడ్ అధికారులకు చక్కటి ఆతిథ్యాన్నిచ్చింది. బహిరంగ సభకు హాజరైన వేలాదిమంది మహిళలకు రవాణా, భోజన సదుపాయాలను కల్పించింది. ఢిల్లీలో బాంబుపేలుళ్ల నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసి సదస్సును విజయవంతంగా ముగించింది.

ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

స్వయంగా అర్జీలు స్వీకరించిన మంత్రి లోకేశ్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ

మంగళగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్ మంగళవారం 72వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి లోకేశ్‌ను కలిసి తమ సమస్యలను చెప్పుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరించిన మంత్రి లోకేశ్ వారి సమస్యలను సావధానంగా విన్నారు. తక్షణ పరిష్కారం అవసరమైన సమస్యలపై అప్పటికప్పుడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. భవన నిర్మాణ కార్మికురాలిగా పనిచేస్తున్న తన తల్లి 9 నెలల క్రితం మరణించారని, నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కింద తమకు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన కోడూరు అశోక్ విజ్ఞప్తి చేశారు. ఆప్కాస్ కింద ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగం చేస్తున్న తాను రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయానని, పొరుగు సేవల ఉద్యోగి కావడంతో తనకు దివ్యాంగ పెన్షన్ అందడంలేదని గుంటూరు జిల్లా ఉప్పలపాడుకు చెందిన భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ సానుభూతిపరుడిననే కక్షతో వైసీపీ హయాంలో అప్పటి ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తనపై అక్రమంగా హత్య కేసు బనాయించి ఇబ్బందులకు గురిచేశాడని సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం శిరిగారిపల్లికి చెందిన రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ హయాంలో తొలగించిన దివ్యాంగ పెన్షన్‌ను పునరు ద్ధరించాలని విజయవాడ రాణీగారితోటకు చెందిన షేక్ గుల్జార్ విన్నవించారు. ఆయా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ అర్జీదారులకు హామీ ఇచ్చారు.



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్



స్నానానికి కాలువలో దిగి మహిళ మృతి

గంటవారిపాలెం (శావల్యాపురం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్నానం చేసేందుకు కెనాల్‌లోకి దిగిన మహిళ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందింది. ఈ సంఘటన శావల్యాపురం మండలం గంటవారిపాలెం గ్రామ సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కాలువ వద్ద మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, వినుకొండలోని కొత్తపాలెం బజారులో నివాసం ఉంటున్న పఠాన్ గౌస్య (34), ఆమె భర్త సుభానీ, అత్త జాన్‌బీతో కలిసి గంటవారిపాలెంలోని అద్దంకి బ్రాంచ్ కాలువ వద్ద నున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మతల్లి దేవాలయానికి వచ్చింది. దేవాలయంలో పూజకు ముందుగా అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో స్నానం చేసేందుకు వారితో కలిసి వెళ్లింది. మొదట భర్త సుభానీ స్నానంచేసి బయటకురాగా గౌస్య, జాన్‌బీ స్నానానికి కెనాల్‌లోకి దిగారు. కెనాల్‌లో నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు ఇద్దరూ కెనాల్‌లోకి జారి పడ్డారు. అక్కడున్న వారు వెంటనే ఇద్దరినీ కాపాడేందుకు ప్రయత్నించగా జాన్‌బీ సురక్షితంగా బయటకురాగా గౌస్య కెనాల్‌లో కొట్టుకుపోయి మృతి చెందింది. స్థానికులు సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గౌస్య మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు



అనూ ఇమ్మాన్యుయేల్

'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.



కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం

'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

- కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.
- నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో



కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్'(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది



- అక్కినేని నాగార్జున

'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనుసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తూంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్, శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చెప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా 'రేలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రేలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.



ప్రథమస్థానం సాధించిన కర్నూలు జిల్లా ఎడ్లజత

ముగిసిన ఎడ్లబండలాగుడు పోటీలు

● ఆరుపళ్ల విభాగంలో కర్నూలు జిల్లా ఎడ్లజత ప్రథమం

దర్శి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో శ్రీహరిహర బాలనాగేంద్రస్వామి 35వ తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీలు ముగిశాయి. మంగళవారం ఆరుపళ్ల విభాగం ఎడ్లబండలాగుడు పోటీల్లో కర్నూలు జిల్లా కోడుమూరు మండలం వెంకటగిరికి చెందిన శశాంక్ శ్రేయ ఎడ్లజత మొదటి స్థానంలో నిలిచింది. గుంటూరు జిల్లా కొల్లిపరకు చెందిన గుడిబండి శ్రీనివాసరెడ్డి ఎడ్లజత రెండోస్థానం, కృష్ణా జిల్లా పెనమలూరు మండలం యనమలకుదురుకు చెందిన అనంతనేని శ్రీకావ్య ఎడ్లజత మూడో స్థానం, కడప జిల్లా ప్రొద్దుటూరు టౌన్ అయోధ్య నగర్‌కు చెందిన వెంకటసాయి బావిత్‌రెడ్డి ఎడ్లజత నాలుగోస్థానం, పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం కేశానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్లజత ఐదోస్థానం, వనపర్తి జిల్లా రేవల్లికి చెందిన కొమిడి రవీంద్రరెడ్డి ఎడ్లజత ఆరోస్థానం, ఎన్టీఆర్ జిల్లా చందర్ల పాడు మండలం పుర్లపాడుకు చెందిన దర్శి సాత్విక్ జశ్వంత్ సింహ ఎడ్లజత ఏడోస్థానం దక్కించుకున్నాయి. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా గూడా శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి వ్యవహరించగా కొత్తా వెంకటేశ్వర్లు, దేవినీడి గోపి, ఆకుల రామలక్ష్మయ్య, గుండాల వెంకటేశ్వర్లు, వెలిదండి గోపాల్ (రిటైర్ట్ ఎల్‌ఐ) పర్యవేక్షించారు.

50,993 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 53,391 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,993 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,744 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	13500
334	10000	17000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14300	334	10500	16500
273	10500	14200	నెంబరు. 5	10000	14600
341	10000	16800	273	---	---
4884	---	---	341	10000	17200
సూపర్ 10	11000	16000	4884	11000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15700	తేజ	10000	15500
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	16800
బ్యాడిగి	10500	16700	దేవనూరు డీలక్స్	10500	16000
దేవనూరు డీలక్స్	-----	----	తాలుకాయలు	5000	8800

మృత్యువును ఎదురించిన మిరాకిల్ బేబీ..!

● 24 వారాలకే జన్మించిన శిశువు
● శిశువుకు గుండె, కంటి, ఊపిరితిత్తుల సమస్యలు
● రమేష్ ఆసుపత్రిలో 3 నెలల చికిత్సతో కోలుకున్న వైనం
● దక్షిణ భారతదేశంలో తొలి కేసుగా వైద్యుల వెల్లడి

గుంటూరు మెడికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేవలం 700 గ్రాముల బరువుతో.. నెలలు నిండకుండా గుండె, ఊపిరితిత్తులు, కంటి ఆరోగ్య సమస్యలతో జన్మించిన ఓ శిశువును గుంటూరు ఆస్టర్ రమేష్ ఆసుపత్రి వైద్యులు మృత్యు ఒడి నుంచి రక్షించారు. మంగళవారం ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఈ అరుదైన కేసు వివరాలను ఆసుపత్రి డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్



శిశువుతో రమేష్ ఆసుపత్రి వైద్య బృందం

డాక్టర్ రాయపాటి మమత తెలియజేశారు. ఫిరంగిపురం మండలం వేములూరిపాలెం గ్రామానికి చెందిన గర్భిణి కొండెపాటి ప్రత్యూష ఈ ఏడాది జూలై 5వ తేదీన రమేష్ ఆసుపత్రిలో 24 వారాల మగ శిశువుకు జన్మనిచ్చారని చెప్పారు. బిడ్డ బరువు 700 గ్రాముల ఉండడంతో ఎన్‌ఐసీయూలో ఉంచామని, ఊపిరితిత్తులు, గుండె బలహీనంగా ఉండటంతో ప్రత్యేకమైన మందులిచ్చి చికితస చేసినట్లు వైద్యం చెప్పారు. రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్, బ్రాంకో పల్మనరీ డిస్‌ప్లేసియా వంటి ప్రాణాంతక పరిస్థితులకు చికిత్స చేశామని, పీడీఏ సమస్యతో గుండెలో రంధ్రం మూసుకుపోకుండా పీడియాట్రిక్ కార్డియాలజీ బృందం చికిత్సను అందించిందని తెలిపారు. కంటికి సంబంధించి రెటినోపతి అఫ్ ప్రీమెచ్యూరిటీ సమస్యను లేజర్ చికిత్స ద్వారా నయం చేశామని చెప్పారు. శిశువును 120 రోజుల పాటు ఎన్‌ఐసీయూలో ఉంచి చికిత్స చేయడంతో పూర్తిగా కోలుకున్నాడని తెలిపారు. ఈ తరహా కేసు దక్షిణ భారతదేశంలో ఇదే మొదటిదని మమత తెలిపారు. తమ బిడ్డకు కొత్త జన్మను ప్రసాదించిన రమేష్ ఆసుపత్రి వైద్య బృందానికి శిశువు తల్లిదండ్రులు దినేశ్, ప్రత్యూష కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఆసుపత్రి వైద్యనిపుణులు అనిత చాగంటి, మహేశ్, అనురాధ, వసంత, భరత్ సిద్దార్థ, తస్నీర్ బేగం, భాను తేజ తదితరులు పాల్గొన్నారు.

మహిళల విద్యతోనే సమాజాభివృద్ధి

● ఏఎన్‌యూ వీసీ ఆచార్య గంగాధరరావు ● ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళలు విద్యా వంతులైతేనే సమాజం అభివృద్ధి దిశగా పయనిస్తుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. విశ్వవిద్యాలయం విద్యా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి పాల్గొని మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను నేటితరం విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశానికి మొదటి విద్యాశాఖ మంత్రిగా అబుల్ కలాం ఆజాద్ ఎంతో విలువైన సేవ చేశారన్నారు. ఆయన రచనలు ఎంతోమందికి స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఈ వేడుకలకు విభాగాధిపతి ఆచార్య పి.బ్రహ్మాజీరావు అధ్యక్షత వహించారు. ముందుగా మౌలానా అబుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే ఢిల్లీలో జరిగిన పేలుళ్లలో మృతిచెందిన వారికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, సైన్స్ ఆర్ట్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆచార్య కె.వీరయ్య, ఆచార్య ఎం.సురేష్ కుమార్, ఆచార్య బ్రహ్మాజీరావు, రూసా కోఆర్డినేటర్ ఆచార్య ఎస్.మురళీమోహన్, డిగ్రి పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎన్.వి.కృష్ణారావు, విభాగం అధ్యాపకులు డాక్టర్ టి.సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

శివస్వాతి టెక్స్‌టైల్స్‌ను సందర్శించిన ఏఎన్‌యూ విద్యార్థులు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ సోషియాలజీ, సోషల్ వర్క్ విద్యార్థులు మంగళవారం చిలకలూరిపేటలోని ఇంటర్నేషనల్ శివస్వాతి టెక్స్‌టైల్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమానికి విభాగాధిపతి ప్రొఫెసర్. ఏం.త్రిమూర్తిరావు ఆధ్వర్యంలో అతిథి అధ్యాపకులు డాక్టర్ పి.రాజకుమార్, డాక్టర్ ఎస్.రాజశేఖర్ సమన్వయకర్తలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏఎంజీ అధ్యక్షుడు డాక్టర్ అరుణ్ కుమార్ మెహంతి, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ సుకుమార్ విద్యార్థులకు వారి సంస్థ సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేసిన ఎంఎల్ కంపెనీ సీనియర్ హెచ్‌ఆర్‌లు డాక్టర్ బాబురావు, డాక్టర్ రవీంద్రబాబుకు ఏం.త్రిమూర్తిరావు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు చరణ గుప్తా, రాజేశ్, నాగేశ్వరరావు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

బైకు బస్సు ఢీ : వ్యక్తి మృతి

పిడుగురాళ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బైకు బస్సు ఎదురెదురుగా ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన జూలకల్లు-కారంపూడి రహదారిపై మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బొల్లాపల్లి మండలం మేకలదిన్నెతండాకు చెందిన బాణావత్ సేవానాయక్ (42) పిడుగురాళ్లలోని హోటల్‌లో పనిచేస్తూ అప్పుడప్పుడు స్వగ్రామానికి వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం పిడుగురాళ్ల నుంచి మేకలదిన్నెతండాకు ద్విచక్రవాహనంపై బయలుదేరి వెళుతున్నాడు. ఈ క్రమంలో జూలకల్లు సమీపంలో కారంపూడి నుంచి పిడుగురాళ్ల వస్తున్న ఆర్టీసీ బస్సు బైకు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సేవానాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మట్టి, జలంతోనే.. మనుగడ

(5వ పేజీ తరువాయి)

వాయిదా వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్‌అహ్మద్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, జడ్పీ చైర్‌పర్సన్ హెనిక్రిస్టీనా, జీడీసీసీ, డీసీఎంఎస్ చైర్మన్లు మక్కెన మల్లికార్జునరావు, వడ్రాణం హరిబాబు, కార్పొరేషన్ల చైర్మన్లు డేగల ప్రభాకర్, మన్నవ మోహన కృష్ణ, పిల్లి మాణిక్యరావు, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, బీజేపీ, జనసేన జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, గాదె వెంకటేశ్వర్లు, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం శశిభూషణ్‌కుమార్, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరి నితిన్‌కడే, గ్రామీణ అభివృద్ధి శాఖ వాటర్ షెడ్ విభాగం సంచాలకులు వై.వి.కె.షణ్ముఖ కుమార్, జాయింట్ కమిషనర్ శివరాం, రాష్ట్ర పంచాయతీ కమిషనర్ కృష్ణతేజ, కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెమ్మసానికి ప్రశంసలు

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ పెమ్మసాని చంద్రశేఖర్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రజలకు సేవ చేసేందుకే ఆయన రాజకీయాల్లోకి వచ్చారన్నారు. కొత్తగా రాజకీయాల్లో ప్రవేశించినప్పటికీ ప్రభుత్వ పథకాలపై ఆయన అవగాహన అభినందనీయ మని కితాబిచ్చారు. హిందీలో ఆయన మాట్లాడుతుంటే హిందీ మాతృ భాష కలిగిన వారికే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. నేను కూడా తెలు గు నేర్చుకొని ఈసారి వచ్చినప్పుడు అదేస్థాయిలో తెలుగులో ప్రసంగి స్తానని చెప్పారు. చెరువును సుందరంగా తీర్చిదిద్దిన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, అధికారులను అభినందించారు. వాటర్‌షెడ్ మహోత్సవ్‌లో వాటర్‌షెడ్ జన్ భగీరథికప్ 2025 బహుమతులు అందజేశారు.

పారిశ్రామికంగా .. పరుగులు

(5వ పేజీ తరువాయి)

కేటాయించారు. ఆయా ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన వసతులను కల్పించనున్నారు. రోడ్లు, విద్యుత్, నీటి, డ్రెయిన్లను కూడా నిర్మించనున్నారు. పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించడంతో పాటు కొత్తగా పరిశ్రమల రంగంలోకి అడుగు పెట్టేవారికి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహాలను అందించనున్నది. ఇందుకోసం పరిశ్రమలశాఖ ఏర్పాట్లు చేస్తోంది. బ్యాంకుల రుణాలతో పాటు కొన్ని రకాల పరిశ్రమలకు కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు రాయితీలు కల్పించనున్నాయి. నరసరావుపేట, చిలకలూరిపేట, పెదకూరపాడు ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు స్థలాల కేటాయింపు ప్రక్రియను త్వరతగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం రెవెన్యూ శాఖను ఆదేశించింది. కాగా తొలుత జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో పారిశ్రామికవాడలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో గతంలోనే వినుకొండ నియోజకవర్గం బొల్లాపల్లిలో 40 ఎకరాల్లో, మాచర్ల మండలం రాయవరం జంక్షన్‌లో 77 ఎకరాల్లో ఎంఎస్ఎంఈలకు శంకుస్థాపన జరిగింది. తాజాగా మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా గుళ్లపల్లి, దాచేపల్లిలో ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో నకరికల్లు మండలం గుండ్లపల్లి వద్ద ఎంఎస్ఎంఈ ఏర్పాటుకు 27 ఎకరాలు, గురజాల నియోజకవర్గం దాచేపల్లి మండలం నడికుడి వద్ద ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు 2.91 ఎకరాలు కేటాయించారు.

ఢిల్లీ బాంబు పేలుళ్ల నేపథ్యంలో తనిఖీలు



ఏపీ-తెలంగాణ సరిహద్దులో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

విజయపురిసౌత్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బాంబు పేలుళ్ల నేపథ్యంలో ఆంధ్ర-తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన నాగార్జున సాగర్ అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద మాచర్ల పోలీసులు మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. రాష్ట్రంలోకి వచ్చి పోయే వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సాగర్ ప్రాజెక్టు దిగువ కృష్ణా నదిపై నుంచి డ్రోన్ కెమెరా ద్వారా పరిశీలించారు. మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా మాట్లాడుతూ, ఢిల్లీ బాంబు దాడుల నేపథ్యంలో సాగర్ బోర్డర్‌లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనపడితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

పల్నాడు వార్తలు

నేడు విద్యుత్ సరఫరా నిలిపి వేత

రెంటచింతల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రెంటచింతల సబ్‌స్టేషన్ 33 కేవీ ఫీడర్‌కు సంబంధించి ఆర్‌డీఎస్‌ఎస్ పనులు జరుగుతున్నందున రెంటచింతల, టెయిల్‌పాండ్ ప్రాజెక్టు, రెంటాల, మిట్టగుడిపాడు గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్‌ను నిలిపి వేస్తున్నట్లు ఏఈ మస్తాన్ వలి చెప్పారు. రైతులకు వేకువ జామున 4 నుంచి ఉదయం 9 గంటల వరకు త్రీఫేజ్ కరెంట్ ఇస్తామన్నారు.

సీసీఐ కేంద్రాల ప్రారంభం నేడు

సత్తెనపల్లి రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రోడ్డులోని అమరావతి మేజరు పక్కన గల లక్ష్మీకాటన్ ట్రేడింగ్ జిన్నింగ్ మిల్లులో ఈ నెల 12వ తేదీ ఉదయం 10గంటలకు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రారంభిస్తారని మార్కెట్ యార్డు చైర్మన్ కోమటినేని శోభారాణి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. 2025 - 26 సీజన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం క్వింటాల్ పత్తి రూ.8,110 మద్దతు ధర ప్రకటించిందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కేటాయించిన జిన్నింగ్ మిల్లుకు రైతులు తమ పత్తిని తీసుకు వచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు.

● మాచర్ల : దుర్గి మండలం అడిగొప్పుల ప్రధాన రహదారిలో గల శ్రీలక్ష్మీ నరసింహ కాటన్ జిన్నింగ్ మిల్‌లో సీసీఐ కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించనున్నట్లు మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ రాజబోయిన మల్లీశ్వరి మధుసూదన్ యాదవ్ తెలిపారు. మంగళవారం ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ఉదయం ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు.

ఎస్సీ కమిషన్ మెంబర్‌గా దాస్

దుర్గి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్సీ కమిషన్ మెంబర్‌గా దుర్గికి చెందిన మేకల బిక్షం అలియాస్ దాస్ ఎంపికయ్యారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వెనుకపడిన పల్నాడు వాసిగా దక్కిన గౌరవప్రదమైన పదవికి తానెంతగానో గర్వపడుతున్నట్లు చెప్పారు. తనను ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి ఎంతగానో రుణపడి ఉంటానన్నారు. కూటమి నేతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

మండల అధ్యక్షుడిగా అబ్బిరెడ్డి


చపారపు అబ్బిరెడ్డి

రెంటచింతల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా చపారపు అబ్బిరెడ్డి పేరును ఖరారు చేస్తూ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మంగళవారం నిర్ణయం తీసుకున్నారు. కొద్ది రోజుల నుంచి అధ్యక్ష పదవి విషయంలో నెలకొన్న ఉత్కంఠతకు తెరపడింది. అబ్బిరెడ్డి 2017 ఏప్రిల్ 12 నుంచి టీడీపీ మండల అధ్యక్ష పదవిలో కొనసాగుతున్నారు. గతంలో సాగు నీటి సంఘ అధ్యక్షుడిగా కూడా వ్యవహరించారు.

గంజాయి బ్యాచ్ వీరంగం

సత్తెనపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గార్లపాడు బస్టాండ్ సెంటర్లో మంగళవారం గంజాయి బ్యాచ్ వీరంగం సృష్టించింది. ఇరువర్గాలకు చెందిన స్నేహితులు తప్పతాగి కొట్టుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఘర్షణకు పాల్పడిన వారిని అదుపులోకి తీసుకోవటానికి ప్రయత్నిస్తే వారిపై కూడా తిరగబడి పరారయ్యారు. యువకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సంతకాల సేకరణ

సత్తెనపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వెంటనే నిలుపుదల చేయాలని కోరుతూ వైసీపీ నాయకులు పట్టణంలోని కోర్టు సెంటర్లో ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. కోటి సంతకాల సేకరణలో భాగంగా సంతకాలు సేకరించినట్టు నాయకులు తెలిపారు. పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మంచినీరు రావడంలేదని ఫిర్యాదు

రెంటచింతల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ రెంటచింతల వడ్డెర బావి సమీపంలోని కాలనీవాసులకు మంచినీరు ట్యాప్‌లు ద్వారా రావడం లేదని నాలుగు రోజులైనప్పటికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు.

అయ్యప్ప స్వాములకు సద్ది

పెదకూరపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడులోని శివాలయంలో అయ్యప్ప స్వాములకు మాజీ సర్పంచ్, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి బాష్యం ఆంజనేయులు కుటుంబసభ్యులు మంగళవారం అయ్యప్ప స్వాములకు సద్ది ఏర్పాటు చేశారు. ఆంజనేయులు, ఆయన సతీమణి ఈ కార్యక్రమంలో పాల్గొని అయ్యప్ప స్వాములకు సద్దిని వడ్డించారు. ప్రతి ఏడాది అయ్యప్ప స్వాములకు సద్ది ఏర్పాటు చేస్తున్నట్టు ఆంజనేయులు తెలిపారు.

దోమల నివారణకు మందు స్ప్రే

గురజాలటౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌అండ్‌బీబంగ్లా వద్ద సాంఘీక సంక్షేమ బాలుర హాస్టల్‌లో మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యాన హాస్టల్ గదుల్లో దోమల నివారణకు మందు స్ప్రే చేశారు. అనంతరం హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ చల్లారు. హాస్టల్ నిర్వాహకులకు శుభ్రతపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆంజనేయులు, ధర్మేంద్రచారి, విమలకుమారి, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్షన్ వీడండి.. అభివృద్ధి సాధిద్దాం

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

దుర్గి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పల్నాడంటే ఎంతో ఘన చరిత్ర కలిగిందని, ఎన్నో యుద్ధాలు జరిగి పల్నాడును సాధించారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మండలంలోని ధర్మవరంలో ఉన్న శ్రీహరిహర బాలనాగేంద్రస్వామి 35వ తిరునాళ్ల మహోత్సవాలను పురస్కరించుకొని ఎడ్లబండలాగు పోటీలను ఆయన ప్రారంభించారు. 15 సంవత్సరాలుగా పల్నాడు ఫ్యాక్షన్‌గా మారిందని, పరిశ్రమలు రావాలంటే భయపడుతున్నారని అన్నారు. అందరూ ఐకమత్యంగా ప్రశాంత వాతావరణం నెలకొల్పితేనే పల్నాడు అభివృద్ధి సాధిస్తుందన్నారు. పల్నాడును ఆనుకొని బుగ్గవాగు ప్రాజెక్ట్ ఉన్నప్పటికీ తాగు, సాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో మంచినీటి సమస్య పూర్తిగా తొలగనుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పల్నాడు ప్రాంత అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. మాచర్లలో వంద పడకల వైద్యశాలతోపాటు దశాబ్ధాల కల వరికపూడిశెల కూడా పూర్తి చేస్తామని హామీనిచ్చారన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ ఫ్యాక్షన్ వీడి విద్య వైపు మొగ్గు చూపాలని, గత పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో 2, 3 స్థానాలు మాచర్ల నియోజకవర్గానికి దక్కడం గర్వంగా ఉందన్నారు. అనంతరం బాలనాగేంద్రస్వామిని దర్శించి పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో మేకల దాసు, పంగులూరి పుల్లయ్య, జూలకంటి అక్కిరెడ్డి, పులి హరి, మాగులూరి నారయ్య, మొగిలి బాలశ్రీను, కటకం రామారావు, దిగుమర్తి సుబ్బారావు, జానకి రామయ్య, వంకమళ్ల కోటేశ్వరరావు, బీమా అమరయ్య, తోటకూర శ్రీనివాసరావు, ఆకుల రామలక్ష్మయ్య, గుండాల వెంకటేశ్వర్లు, వెలిదండి శ్రీనివాసరావు, నాగెండ్ల శ్రీను, కూటమి నేతలు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవాన్ని విజయవంతం చేయండి

మాచర్ల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని నూతన కమిటీల ప్రమాణ స్వీకారోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మానుకొండ కల్యాణ మండపంలో బుధవారం మండల, గ్రామ కమిటీ సభ్యులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి కూటమి నేతలు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఉగ్రమూకల దుశ్చర్యలను సహించం

మాచర్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీ ఎర్రకోట సమీపంలో ఉగ్రమూకలు జరిపిన భారీ బాంబు పేలుళ్లను సహించమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నరమేధానికి పాల్పడిన ఏ ఒక్కరినీ భారత ప్రభుత్వం క్షమించదని స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని అరికట్టేందుకు ప్రధాని మోదీ ఏ నిర్ణయం తీసుకున్నా యావత్తు దేశం ఆయన వెంట నడుస్తుందన్నారు. ఈ పేలుళ్ల ఘాతుకంలో అసువులు బాసిన అమాయక ప్రజలకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

మైనింగ్ ప్రాంతాలను తనిఖీ చేసిన అధికారులు


కోనంకి మైనింగ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పిడుగురాళ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోనంకి గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో గత ప్రభుత్వ పాలనలో మైనింగ్‌శాఖ అనుమతులు లేకుండా జరిపిన గ్రావెల్ తవ్వకాలపై మంగళవారం మైనింగ్, రెవెన్యూ అధికారులు తనిఖీ నిర్వహించారు. ఎక్కడెక్కడ మైనింగ్ జరిపారు. ఎన్ని మెట్రిక్ టన్నుల గ్రావెల్‌ను తవ్వితీశారనే వివరాలు తెలుసుకునేందుకు పలు ప్రాంతాలను అధికారులు పరిశీలించి ఫిర్యాదుదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైనింగ్ ఏజీ సుధాకర్, తహసీల్దార్ మధుబాబు, ఆర్‌ఐ శ్రీనివాసబాబు, సర్వేయర్ జి.వెంకటేశ్వర్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని ట్రైబల్ వెల్ఫేర్ బాలుర పాఠశాల


బాలుర పాఠశాల నూతన భవనం

కారంపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కారంపూడి మండల సరిహద్దులోని దొంగరాముడు తండాకు వెళ్లే రహదారిలో రూ.6 కోట్ల వ్యయంతో ప్రభుత్వం ట్రైబల్ వెల్ఫేర్ బాలుర పాఠశాలను నిర్మించింది. ఈ నిర్మాణం పూర్తయి ఆరు నెలలు కావొస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం విద్యార్థులందరూ జడ్పీ హైస్కూల్ వెనుక ఉన్న ఇరుకు భవనాల్లో విద్యాభ్యాసం చేస్తూ వసతి గదుల్లో మగ్గుతున్నారు. పక్కనే బాలికల వెల్ఫేర్ పాఠశాల ఉంది. విద్యార్థినులు ఎక్కువగా ఉండడంతో బాలుర భవనాన్ని కూడా విద్యార్థినులకు ఇచ్చి నూతన భవనంలోకి వెళ్లాల్సి ఉంది. అయినా ఇంతవరకు ప్రారంభం కాకపోవడంతో 125 మంది విద్యార్థులు పాత భవనంలోనే ఉండాల్సి వస్తోంది.

ఎంఈవో రవికుమార్ వివరణ

ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ నిర్మాణం పూర్తయి ఆరు నెలలు అయిన మాట వాస్తవమేనని ఎంఈవో రవికుమార్ అన్నారు. అక్కడికి వెళ్లేందుకు రహదారి ఇబ్బందిగా ఉందన్నారు. నూతన రహదారి నిర్మించాలని అధికారులను కోరామన్నారు.

రాష్ట్ర డైరెక్టర్‌గా చినరాజు నియామకం అభినందనీయం


పంచాయతీరాజ్ అతిథి గృహంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు బ్రహ్మయ్య

పెదకూరపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సహకారంతో సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా డాక్టర్ చినరాజును నియమించటం అభినందనీయమని టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో మంగళవారం సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు రాష్ట్ర డైరెక్టర్‌గా పెదకూరపాడుకు చెందిన డాక్టర్ గుడిపూడి చినరాజును నియమించటంతో అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి బాష్యం ఆంజనేయులు, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ అంద్ర ప్రసాదు, టీడీపీ స్థానిక నాయకులు మద్దినేని వెంకట సత్యానారాయణ, గంగినేని చిన్న, శివ నాగరాజు, షేక్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారు

కాకతీయ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌బాబు



కన్నెగండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

పెదకూరపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేటి యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ భవిష్యత్తును పాడు చేసుకోవటమే కాకుండా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని కాకతీయ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌బాబు అన్నారు. కాకతీయ జూనియర్, డిగ్రీ కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు మంగళవారం మండలంలోని కన్నెగండ్ల, లగడపాడు గ్రామాల్లో స్పెషల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రగ్స్ వద్దు బ్రో.. అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ షేక్ కరీం, 75 తాళ్ళూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు వట్టికూడి శివరామకృష్ణయ్య, కోరంపల్లి నరేంద్ర, మోదుగుల చంద్రశేఖర్, పెద్దింటి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో మానవహారం ఏర్పాటు చేశారు.

జడ్పీటీసీ, సర్పంచుల జన్మదిన వేడుకలు

దాచేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి కుమారులు పిడుగురాళ్ళ జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, గామాలపాడు సర్పంచ్ జంగా సురేష్ జన్మదిన వేడుకలు నవంబరు 11వ తేదీన ఒకే రోజు కావటంతో అభిమానులు ఉత్సాహంగా జరుపుకున్నారు. దాచేపల్లి మండలం గామాలపాడు గ్రామంలోని స్వగృహంలో కేక్‌ను కట్ చేసి అభిమానులు అన్నదమ్ములకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్య క్రమానికి దాచేపల్లి మండలంలోని కూటమి నేతలు హాజరయ్యారు.

సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే ప్రమాదాలు నివారించవచ్చు

క్రోసూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో వంట గ్యాస్ లీకై మంటలు వ్యాపించినప్పుడు ఎటువంటి కంగారు పడకుండా సమయ స్ఫూర్తితో వ్యవహరిస్తే ప్రమాదాన్ని నివారించవచ్చని రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖ అధికారులు సూచించారు. ఇటీవల దీపావళి పండుగ రోజు మండలంలోని పీసపాడులో గ్యాస్ సిలిండర్ పేలి నలుగురు తీవ్రంగా గాయపడటం, కొద్ది రోజుల తరువాత వీరిలో ఇద్దరు మరణించిన ఘటన నేపథ్యంలో మూడు శాఖల అధికారులు సోమవారం రాత్రి గ్రామంలో ప్రజలను చైతన్యవంతులను చేసే కార్యక్రమం చేపట్టారు. గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను వెంటనే ఆఫ్ చేయటం, మంటలు వ్యాపించినప్పుడు ఖాళీ పది లీటర్ల బక్కెట్ సిలిండర్‌పై బోర్లించటం, తడిపిన టవల్ కాని, దుప్పటి గాని మంటలు వ్యాపించిన చోట కప్పితే వెంటనే మంటలు ఆరిపోతాయని, తర్వాత వెంటనే గ్యాస్ ఆపివేయాలని సూచించారు.

రైతులు సీఎం యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి : ఏవో

ముప్పాళ్ళ నవంబరు 11(ఆంధ్రజ్యోతి): త్వరలో సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారని రైతులు తమ పత్తిని కొనుగోలు కేంద్రానికి తెచ్చేటప్పుడు తేమశాతాన్ని 8నుంచి 12 శాతం వరకు ఉండేలా ఆరబెట్టుకోవాలని ఏవో శ్రీధర్‌రెడ్డి అన్నారు. ముందుగా రైతులు రైతుసేవా కేంద్రం వద్దకు వచ్చి రైతులు తమపేర్లను సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు. మండలంలోని నార్నెపాడు, పలుదేవర్లపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోందిలో రైతులకు వరిసాగులో ప్రస్తుతం చేపట్టాల్సిన విధానాలను వివరించారు.

సుడిగుండాల వాగులో పూడిక తీత

● టీడీపీ మండల అధ్యక్షుడు మొఘల్ జాన్


పూడిక, నాచు తొలగించటంతో సుడిగుండాల వాగులో పారుతున్న నీరు

క్రోసూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లేరు సుడిగుండాల వాగులో ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారులు, టీడీపీ మండల అధ్యక్షుడు మొఘల్ జాన్‌ల ఆధ్వర్యంలో మంగళవారం పూడిక తీత పనులు చేపట్టారు. సుమారు కిలో మీటరు మేర వాగులో పూడిక, నాచు, పిచ్చి చెట్లు పేరుకుపోవటంతో సమస్యను ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే నిధులు కేటాయించి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించినట్లు షేక్ మొఘల్‌జాన్ తెలిపారు. దీంతో అధికార యంత్రాంగం జేసీబీ సాయంతో తక్షణమే వాగు మరమ్మతుల పనులు మంగళవారం నిర్వహించామన్నారు. సమస్య పరిష్కరించిన అధికారులకు, పార్టీ నాయకులు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం మంగళవారం నాటికి 588.50 అడుగులు ఉంది. ఇది 307.57 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5654 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 34,011 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 51,476 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 51,476 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

లక్ష్యానికి చేరువలో విద్యుదుత్పత్తి : ఎస్ఈ

రెంటచింతల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో సోమవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.037 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగిందని అయితే ఇప్పటివరకు తయారైన విద్యుత్‌తో లక్ష్యానికి చేరువలో ఉన్నామని ఎస్ఈ కె.వెంకటరమణ చెప్పారు. మంగళవారం రాత్రి ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడుతూ 2026 మార్చి 31 వరకు 80 ఎంయూల విద్యుత్ తయారు చేయాలనేది టార్గెటని ఇప్పటికే 70.234 ఎంయూల కరెంట్ తయారు చేశామన్నారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 3 గేట్లను 1.5 మీటర్లు,1 గేట్‌ను 1 మీటర్ మేర ఎత్తి 25492 క్యూసెక్కులు, టీఆర్‌సీ ద్వారా 8716 మొత్తంగా 34208 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు


రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థులు

దాచేపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యాన గుంటూరు జిల్లా ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అండర్ - 17 విభాగంలో దాచేపల్లికి చెందిన దుర్గా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ మల్లికార్జునశాస్త్రి మాట్లాడుతూ డిస్కస్ త్రో బాలికల విభాగంలో షేక్ షాఫియా మొదటిస్థానం, బాలుర విభాగంలో వైనాథ్ రెండోస్థానం, బాలికల హైజంప్‌లో యశస్విని రెండోస్థానం, బాలుర విభాగంలో కె.వెంకటశివసాయి తృతీయస్థానం, హైజంప్ బాలుర విభాగంలో 400 మీటర్లలో షేక్ వీరమస్తాన్ రెండోస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. ఉపాధ్యాయులు, యాజమాన్యం విజేతలను అభినందించారు.

జనసేన నేత కుటుంబానికి ఆర్థికసాయం

మాచర్ల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన జనసేన నేత కొమెర రమణయ్య భార్యకు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో శస్త్రచికిత్స జరిగింది. ఈ మేరకు జనసేన నేత, న్యాయవాది బత్తుల బాబురావు మంగళవారం రమణయ్య కుటుంబానికి హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో బత్తుల శివ, కొమెర శ్రీను, డేవిడ్, చెన్నకేశవులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి

నకరికల్లు నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చేజర్ల గ్రామంలో కుక్కలు గేదెలను కరుస్తున్నాయి. పిల్లలు బయటకు రావాలంటే భయపడుతున్నారు. అధికారులు వెంటనే కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు గాడిదమళ్ల పిచ్చారావు, ఈవూరు అప్పిరెడ్డి కోరారు. గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉండి ఇంట్లో వస్తువులన్నీ పాడైపోతున్నాయన్నారు అంతేగాక మనుషుల మీదకు దూకి గాయపరుస్తున్నాయని అన్నారు. గ్రామంలో వీధిలైట్లు లేక ఇబ్బందులుగా ఉందన్నారు. గ్రామంలో వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని, సైడ్ కాలవలు నిర్మించాలని కోరారు. మంగళవారం ఈ మేరకు సచివాలయ ఉద్యోగులకు సీపీఎం నేతలు వినతిపత్రం అందజేశారు.

పంటల సాగుపై రైతులకు శిక్షణ

క్రోసూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుపై రైతులకు వ్యవసాయ అధికారులు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పత్తి, మిర్చి, మాగాణి, మొక్కజొన్న, శనగ వంటి పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు.

విద్యారంగ అభివృద్ధికి అబుల్ కలాం ఆజాద్ కృషి


మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

సత్తెనపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని మంగళవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే కన్నా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినూత్న సంస్కరణల ద్వారా దేశంలో విద్యాభివృద్ధికి మౌలానా విశేషంగా కృషి చేశారన్నారు. విద్యారంగానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మస్తాన్‌వలి, రాంబో బుడే, చౌట శ్రీనివాసరావు, నూర్‌బాషా జానీ బాబు, జానీ ఖాజావలి, అబ్దుల్లా, మాబూ, డీ శ్రీనివాసరావు తదితర కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. మస్తాన్ ఐటీఐ కళాశాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మౌలానా జయంతి నిర్వహించారు.

● మాచర్ల రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వేణుబాబు ఆధ్వర్యాన ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అయ్యప్ప పడిపూజల్లో ఎమ్మెల్యేలు యరపతినేని, కన్నా


ఇందిరమ్మ కాలనీలో అయ్యప్పస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో బేతంచర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన అయ్యప్ప పడి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు. స్వామికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కటకం అంకారావు, కామిశెట్టి రమేష్, పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, ఎల్‌వీఆర్, అయ్యప్పలు తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి రూరల్ : మండలంలోని ధూళిపాళ్ళలో మంగళవారం రాత్రి ఏర్పాటు చేసిన ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి పడిపూజలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఎమ్మెల్యేను గురుస్వామి ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఆయన వెంట టీడీపీ గ్రామ, మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


అయ్యప్ప పడి పూజ మహోత్సవంలో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కన్నా

రాష్ట్ర వృత్తి నైపుణ్య పోటీలకు కారంపూడి విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం శివశేషిరెడ్డి

కారంపూడి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వృత్తి నైపుణ్య పోటీలకు స్థానిక బ్రహ్మనాయుడు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం శివశేషిరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. విద్యార్థులకు వివిధ వృత్తి నైపుణ్యాలపై విద్యాశాఖ సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యాన ఈనెల 7వ తేదీన ధూళిపాళ్లలోని లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కిల్ కాంపిటేషన్లో పాఠశాల ఒకేషనల్ విభాగాలైన ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్ నుంచి విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ విభాగంలోని విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులకు డీఈవో చంద్రకళ, జీసీడీవో రేవతి గార్లు బహుమతులు అందించారన్నారు.

పిరమిడ్ ధ్యానంతో శారీరక, మానసిక ప్రశాంతత

● పత్రీజీ పిరమిడ్ జగత్ ట్రస్ట్ చైర్మన్ శోభారాణి


ధ్యాన ఆశ్రమం ప్రారంభోత్సవంలో శోభారాణి తదితరులు

విజయపురిసౌత్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పిరమిడ్ ధ్యానంతో శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని పత్రీజీ పిరమిడ్ జగత్ ట్రస్ట్ చైర్మన్ శోభారాణి అన్నారు. మంగళవారం బ్రహ్మర్షి పితామహ పత్రీజీ మహా అవతరణ వేడుకలను పురస్కరించుకొని పిరమిడ్ ధ్యాన మాష్టర్ సతీష్ ఆధ్వర్యాన విజయపురిసౌత్‌లో ధ్యాన ఆశ్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే ధ్యానం చేయాలన్నారు. శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం కలుగుతుందన్నారు. అనంతరం శాకాహార ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేత జూలకంటి చిరంజీవిరెడ్డి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, మెట్రిక్ శ్రీను, రంగనాయకులు, ఉష, సీనియర్ పిరమిడ్ మాస్టర్లు జగదీష్‌రెడ్డి, డాక్టర్ శివకుమార్, జ్ఞానేశ్వరి, రాంబాబు, గంటా ధనుంజయరావు, పులుసు వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వీరబ్రహ్మేంద్ర స్వామి నాటకం

నకరికల్లు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చాగల్లు గ్రామంలో సోమవారం రాత్రి ప్రదర్శించిన శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నాటకం ప్రజలను ఆకట్టుకున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత బాషా సంస్కృతి సమితి విజయవాడ వారి సౌజన్యంతో చాగల్లు శ్రీ సీతారామాంజనేయ నాటక కళాకారుల సంఘం ఈ నాటికను ప్రదర్శించారు. పౌరాణిక పద్యాలతో జరగబోయే విషయాలను వీరబ్రహ్మేంద్ర స్వామి తెలిపిన కాలజ్ఞాన తత్వం ప్రజలను ఆలోచింప చేసింది. నటీనటులు మంచి నటనతో ఆకట్టుకున్నారు. నాటకాన్ని చూసేందుకు గ్రామీణ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

నరసరావుపేటలో అనధికార నిర్మాణాలపై చర్యలు

● మునిసిపల్ కమిషనర్ జస్వంతరావు

నరసరావుపేట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పుర పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఇటీవల జారీచేసిన ఆదేశాల మేరకు ఆగస్టు 31వ తేదీ తరువాత జరిగే అనధికార నిర్మాణాలపై ప్లానుకు విరుద్ధంగా నిర్మించే భవనాలపై చర్యలు చేపట్టనున్నట్లు మునిసిపల్ కమిషనర్ జస్వంతరావు వెల్లడించారు. ఇప్పటికే పూర్తయిన భవనాలను క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ప్లానుకు విరుద్ధంగా కాని అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తే అటువంటి నిర్మాణాలను మునిసపల్ సిబ్బంది కూల్చివేస్తారన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నేడు స్పైసెస్ పార్కుకు కలెక్టర్ రాక

యడ్లపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలంలోని సుగంధ ద్రవ్యాల పార్కు (స్పైసెస్‌పార్కు)ను పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా బుధవారం సందర్శించనున్నారు. ఉదయం 10గంటలకు పార్కువద్దకు చేరుకుని పార్కులోని భూములను పరిశీలిస్తారని రెవెన్యూ అధికారులు తెలిపారు.

మహిళను బెదిరించి గొలుసు చోరీ

నాదెండ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గేదెలు మేపుకోవటానికి సమీపంలో ఉన్న పొలాల్లోకి వెళ్ళిన బిజ్జం ధనలక్ష్మి అనే మహిళను బెదిరించి బంగారు గొలుసును చోరీచేసిన సంఘటన మంగళవారం సాతులూరు గ్రామ పరిధిలో జరిగింది. గుంటూరు రోడ్డులోని ఎన్ఎస్‌పీ కాలువ వద్ద గేదెలు మేపుకుంటుండగా బైక్‌పై వచ్చిన వ్యక్తి బెదిరించి ఏడు గ్రాముల గొలుసును లాక్కెళ్ళాడు. ఈ క్రమంలో ఆమె కేకలు వేయటంతో దుండగుడు బైక్ అక్కడ వదిలి పరారయ్యాడు. నాదెండ్ల పోలీసులకు మహిళ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి, బైక్‌ను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నాదెండ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గణపవరం గ్రామంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో నివాసం ఉండే ముదిగళ్ళ ఏసుదాసు(64) స్థానిక స్పిన్నింగ్ మిల్లులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అక్టోబరు 20వ తేదీన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తూ రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని గుంటూరు జీజీహెచ్‌కి తరలించగా చికిత్స పొందుతూ ఆయన మృతి చెందాడు.

పైపుల కంపెనీలో చోరీ

నాదెండ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామ పరిధిలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న విష్ణు సన్ పైపు కంపెనీలో చోరీ జరిగింది. కంపెనీ ప్రాంగణంలో ఉన్న గది సెక్టర్‌ను పగలగొట్టి సుమారు ఐదు క్వింటాళ్ళ ఇనుమును చోరీ చేశారు. సోమవారం రాత్రి 10 గంటల వరకు పనులు నిర్వహించిన తాము ఇంటికి వెళ్ళినట్టు కంపెనీ నిర్వాహకుడు పవన్ కుమార్ తెలిపారు. ఉదయం కంపెనీ వద్ద చూడగా ఇనుము చోరీని గుర్తించినట్టు వివరించారు. కంపెనీలోని సీసీ కెమేరాల పుటేజ్‌ని పోలీసులకు అందజేశారు.

వైద్య కళాశాలల పీపీపీని వ్యతిరేకిస్తూ

వైసీపీ కోటి సంతకాల సేకరణ

● నరసరావుపేట లీగల్, నరసరావుపేట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా నరసరావుపేట వైకాపా లీగల్ సెల్ ఆధ్వర్యంలో కోర్టు ఎదుట, గాంధీ పార్కు వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో నరసరావుపేట మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంటలెక్చువల్ విభాగం కార్యదర్శి ఈ.ఎం.స్వామి మాస్టర్ ,రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి గంటేన్నపాటి గాబ్రియేలు, ఈదర గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

● నాదెండ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న బండారుపల్లి సత్యనారాయణకు వ్యతిరేకంగా స్వగ్రామమైన సాతులూరు టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే, ఈ సమావేశ విషయపై పత్రికల్లో వచ్చిన కథనాలపై ఇంటిలిజెన్సి వర్గాలు ఆరా తీశాయి.

● నాదెండ్ల: నాదెండ్ల గ్రామంలోని ఉర్దూ పాఠశాల ఫర్నీచర్ కొనుగోలుకు రూ. 10,116ల నగదును మంగళవారం అందజేశారు. బత్తిన వెంకట నారాయణ జ్ఞాపకార్థం వారి కుమారులు వెంకటేష్, చైతన్యలు ఈ నగదును ఉపాధ్యాయులు తాజ్, నసీమూన్‌లకు అందజేశారు.

● నరసరావుపేట టౌన్: వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థి కాసా శ్రీనివాసరావు ఖోఖో ఆంధ్ర జట్టుకు ఎంపిక అయ్యాడని ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. విజయనగరం విజ్జి స్టేడియంల ఈ నెల 8, 9, 10 తేదీలలో అండర్ 19 ఎస్‌జీఎఫ్ ఖోఖో పోటీలలో ఈ ఘనత సాదించాడన్నారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఇండస్ట్రీ 4.0 టూల్స్ ఫర్ ఇన్నోవేటర్స్, ఎంట్రపెన్యూర్స్ అనే అంశంపై వర్క్‌షాప్ మంగళవారం నిర్వహించారని కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య తెలిపారు. ముఖ్యఅతిథిగా భీమవరం శ్రీవిష్ణు మహిళా ఇంజనీరింగ్ కాలేజీ డాక్టర్ అనుజ్, డాక్టర్ అనోచ్ రిసోర్స్‌పర్సన్లుగా హాజరై ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ వినియోగంపై అవగాహన కల్పించారు.

● నరసరావుపేట లీగల్: పల్నాడు జిల్లాలో హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ కోసం ఏపీ సాక్స్ నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని జిల్లా లెప్రసీ ఎయిడ్స్ అధికారి డాక్టర్ మాధవీలత మంగళవారం ఆదేశించాచరు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జరిగిన ఈ మీటింగ్‌లో టార్గెట్ ఎన్జీవోలు, లింక్ వర్కర్ స్కీమ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీల్లో పారిశుధ్యం అధ్వానం

● అమలు కాని స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర
● వ్యాధులబారిన పడుతున్న ప్రజలు
● పట్టించుకోని అధికారులు



కొండ్రముట్ల ఎస్సీ కాలనీలో రహదారి దుస్థితి

ఈపూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీల్లోని ఎస్సీ కాలనీలలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. మురికి కాలువల్లో పూడిక పేరుకుపోయి పిచ్చి కంప పెరిగి చిట్టి అడవులను తలపిస్తున్నాయి. కొండ్రముట్ల కొచ్చర్ల ఉడిజర్ల కాలనీలలో పారిశుధ్యం అధ్వానంగా ఉండడంతో ఆ కాలనీలోని ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర అంటూ అధికారులు తూతూ మంత్రం పనులతో చేతులు దులుపుకుంటున్నారు తప్ప ఆచరణలో ఎక్కడా పారిశుధ్య పనులు ఎక్కడా అమలు జరగడం లేదు. అధికారులు చెప్పే మాటలకు చేసే పనికి పొంతన లేదు. కొచ్చర్ల గ్రామంలో ఎస్సీ కాలనీకి వెళ్లే సిమెంట్ రోడ్డుపై మురికి నీరు కుంటలాగా ఎప్పుడు నిలిచి ఉంటోంది. సైడ్ కాలవల్లో పేరుకు పోయిన మట్టిని తొలగించకుండా ఉండటంవల్లనే మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. అయితే కొన్నిచోట్ల మురికి కాల్వలను కూడా ఆక్రమించడం వలన మురుగు నీరు అంతా రోడ్ల ప్రవహిస్తూ ప్రజలకు అసౌకర్యంగా మారింది. కొండ్రముట్ల కాలనీలో సైడు కాలువలు రూపురేఖలు కోల్పోయాయి. అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీలో ప్రజలు కోరుతున్నారు.



రెడ్డిపాలెంలో వ్యర్థాలతో పూడుకుపోయిన కాలువ

రెడ్డిపాలెం గ్రామంలో...

రొంపిచర్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. కాలువల్లో పూడిక తీయకపోవటంతో నీరు నిల్వ ఉండి దోమలకు నిలయాలుగా మారింది. వ్యర్థాలతో గ్రామంలో పలుచోట్ల కాలువలు పూడుకుపోయాయి. గ్రామంలో అన్ని మురుగు కాలువల్లో మురుగు పారుదల లేక నిలిచిపోతోంది. మండలంలో అత్యధిక ప్రజలు ఉన్న గ్రామంగా రెడ్డిపాలెం ఉంది. ఐనా అధికారులు పట్టించుకోవటం లేదు. అధికారులు స్పందించి మురుగు కాలువల్లో ఉన్న పూడికతను తొలగించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.



కొచ్చర్ల ఎస్సీ కాలనీలో పశువులను కట్టి వేయడంతో పూర్తిగా పూ డిపోయిన డ్రెయిన్

అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి



అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం భారతరత్న జనాబ్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ 138వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరై మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే, మాబు, షేక్ మన్నాన్ షరీఫ్, సుభాని, ముస్లిం మైనారిటీ నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: స్థానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ విద్యాదినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ మాట్లాడుతూ భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని జాతీయ విద్యాదినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

● పట్టణంలోని పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి షేక్ మహమ్మద్ రఫీ, మైనారిటీ నాయకులు బుజ్జి, రహీం, యాసిన్, కరీం తదితరులు నివాళులర్పించారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున, డిప్లొమో ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మౌలానా అబుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పీ ఉమాదేవి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో అబుల్ కలాం ఆజాద్ క్రియాశీలకంగా పని చేశారని, పండితుడు, కవి, జర్నలిస్టుగా, భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా సేవలందించారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీ ఉమాదేవి, నూజెండ్ల సొసైటీ చైర్‌పర్సన్ బచ్చు అంజిరెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంగినేని రాధాకృష్ణమూర్తి, అధికారులు పాల్గొన్నారు.



అబుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు



రామకోటయ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

టీడీపీ సీనియర్ నాయకుడు రామకోటి మృతి

● కుటుంబ సభ్యులకు చీఫ్ విప్ జీవీ పరామర్శ

ఈపూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చర్ల గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బీసపోగు రామకోటయ్య(75) మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యులను చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పరామర్శించారు. అదేవిధంగా భద్రపాలెంలో కాలువలో జారిపడి మృతిచెందిన ఏడో తరగతి విద్యార్థిని లక్ష్మీనరసమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట అంగలూరు సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి బాలయ్య, ఈపూరు సొసైటీ డైరెక్టర్ అయినాల కోటేశ్వరావు, పిండి వెంకటేష్, నిశంకర్రావు అంకారావు, ఇత్తడి అశోక్, తదితరులు ఉన్నారు.

జగ్గారావుకు సన్మానం

ఈపూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన రాపర్ల జగ్గారావును మంగళవారం ప్రభుత్వ చీఫ్‌విప్ ఆంజనేయులు ఈపూరులో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంగులూరు, ఈపూరు సొసైటీ చైర్మన్లు తిరుమలశెట్టి బాలయ్య, విడపలపాటి హనుమయ్య, సొసైటీ డైరెక్టర్ అయినాల కోటేశ్వరరావు, సూరేకోటేశ్వరరావు, కాటన్ కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.


ప్రకృతి వ్యవసాయంతో భూమి సారవంతం

● జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు

నరసరావుపేట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా భూమి సారవంతతతోపాటు మానవ ఆరోగ్యాన్ని కాపాడవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు పేర్కొన్నారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం (నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్) కార్యక్రమంలో భాగంగా కొత్తగా ఎంపికైన గ్రామాల పీఏసీఆర్పీలకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శిక్షణ రెండోరోజు జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు, రాష్ట్ర వనరుల శాఖ అధికారి రామచంద్రం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలు, చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి, అదనపు డీపీఎం ప్రేమ్ రాజ్,స్టేట్ ఎన్ఎఫ్ఏ మల్లేశ్వరి, జిల్లా ఎన్ఎఫ్ఏలు సైదయ్య, సౌజన్య, నంద కుమార్, మేరీ, అప్పలరాజు, అలాగే మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

కాకతీయ విద్యాట్రస్టు విద్యార్థినులకు వైద్య పరీక్షలు

నరసరావుపేట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటప్పకొండలోని కాకతీయ విద్యాట్రస్టులోని బాలికల హస్టల్‌లో విద్యార్థులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. నరసరావుపేట పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యశాల నెల్లూరి సూపర్‌స్పెషాలిటీ వైద్యులు రమేష్, అమీష విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రమేష్ మాట్లాడుతూ కాకతీయ విద్యాటస్టు కమిటీ ఆదేశాల మేరకు బాలికలకు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేయడం జరిగిందన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

● మునిసిపల్ కమిషనర్ జస్వంతరావు

నరసరావుపేట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రజలందరూ సహకరించాలని మునిసిపల్ కమిషనర్ జస్వంతరావు తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని మునిసిపల్ బంగ్లాలో మంగళవారం వార్డు పర్యావరణ కార్యదర్శులకు, ఎమినిటీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. పట్టణంలోని వర్తక వ్యాపారులు, వినియోగదారులకు అవగాహన కలిగించేందుకు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, మునిసిపల్ రెవెన్యూ అధికారి, స్టేట్ కో ఆర్డినేటర్ శివన్నారాయణ, జిల్లా కో ఆర్డినేటర్ శివపార్వతి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై ఉపాధిహామీ గ్రామసభలు

శావల్యాపురం, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను కనమర్లపూడి, శావల్యాపురం, కొత్తలూరు గ్రామాల్లో చేపట్టవలసిన అభివృద్ధి పనులపై మంగళవారం ఉపాధిహామీ గ్రామసభలు నిర్వహించారు. కనమర్లపూడిలో 35, శావల్యాపురంలో 50, కొత్తలూరులో 50 పనులను గుర్తించి, గ్రామసభల్లో ప్రజలకు వివరించి పంచాయతీ తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, సర్పంచ్‌లు గుంటూరు నాగమల్లేశ్వరి, తన్నీరు భారతి, యాగసిరి చెన్నమ్మ, డిప్యూటీ ఎంపీడీవో వివేకానంద, పంచాయతీ కార్యదర్శులు బొడ్డు యాకోబు, మహేంధర్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు చెరుకూరి బాలకృష్ణ, జగదీష్, శ్రీనివాసరావు, తెలుగు రైతు జిల్లా ఉపాధ్యక్షుడు గోరింట్ల హనుమంతరావు పాల్గొన్నారు.

రాయితీపై శనగ విత్తనాలు: ఏవో హరిప్రసాద్



యడ్లపాడు రైతు సేవా కేంద్రంలో శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏవో హరిప్రసాద్

యడ్లపాడు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రబీలో శనగ సాగుచేసే రైతులకు 25శాతం రాయితీతో విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ తెలిపారు. మంగళవారం యడ్లపాడు రైతు సేవా కేంద్రంలో రైతులకు శనగ విత్తనాలు పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రస్తుతం 95క్వింటాళ్ల జేజీ 11 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ రకం విత్తనాల ఖరీదు మార్కెట్‌లో రూ.78 రూపాయలు కాగా రాయితీతో రూ.58.50లకే రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. మండలంలోని యడ్లపాడు, జాలాది, తుర్లపాడు, సొలస, లింగారావుపాలెం గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచామన్నారు. కావలసిన రైతులు ఆధార్, పాసుపుస్తకం జిరాక్స్ కాపీతో రైతు సేవాకేంద్రంలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు బిలాల్, టీడీపీ నాయకులు పోపూరి వీరాంజనేయులు, ముత్తవరపు కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మండలంలోని నాదెండ్లలోని రైతు సేవా కేంద్రంలో రాయితీపై శనగ విత్తనాల పంపిణీని మంగళవారం ప్రారంభించారు. ఈ పంపిణీని సొసైటీ అధ్యక్షుడు నల్లమోతు హరిబాబుతో కలసి వ్యవసాయ అధికారి శ్రీలత ప్రారంభించారు. నాదెండ్ల, సాతులూరు, చందవరం, చిరుమామిళ్ళ, ఇర్లపాడు, సంక్రాంతిపాడు, గొరిజవోలు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో శనగలు అందుబాటులో ఉన్నాయని ఏవో వివరించారు. ఎకరాకు 40కిలోల చొప్పున ఒక్కొక్క రైతుకు ఐదు ఎకరాలకు రెండు క్వింటాళ్ళు అందిస్తామని ఆమె తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

చిలకలూరిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం పట్టణంలోని విజయ బ్యాంకు సెంటర్లో జాతీయ రహదారిపై మోటార్ బైక్‌పై వెళ్తూ డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ గుంటూరు శ్రీనివాసరావుతోటకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి సిరిగిరి సురేష్ (23) గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందినట్టు అర్బన్ పోలీసులు మంగళవారం తెలిపారు.

తప్పు చేయకుంటే వైసీపీ నేతలకు భయమెందుకు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యిలో తమ పాత్ర లేనప్పుడు, తప్పులు చేయకుంటే వైసీపీ నేతలకు భయమెందుకు అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రతిపాటి మాట్లాడుతూ జగన్ సిట్ దర్యాప్తును నీరుగార్చేలా ఎందుకు అడ్డుతగులుతున్నారని ప్రశ్నించారు. వెంకన్న స్వామితో పెట్టుకుంటే పుట్టగతులుండవనేది జనమెరిగిన సత్యమన్నారు. విశాఖ సీఐఐ సమ్మిట్ ఏపీలో పారిశ్రామిక శకానికి నాంది కానున్నదని తెలిపారు. సీఎం చంద్రబాబు విజన్ ఏపీ ప్రగతికి ఆక్సిజన్‌లా పనిచేస్తోందని, రూ.9.8లక్షల కోట్ల పెట్టుబడులు, 410 ఒప్పందాల కార్యరూపం రాష్ట్ర పారిశ్రామిక విప్లవంలో నూతన అధ్యాయం అన్నారు. ఈ ఒప్పందాల ద్వారా ప్రభుత్వ కృషితో 7.5లక్షల ఉద్యోగాలు లభించనుండటం రాష్ట్ర యువతకు గొప్ప వరమన్నారు. జగన్ హయాంలో మితిమీరిన అవినీతి, బెదిరింపులతో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రాకుండా పోయాయని విమర్శించారు.

నేడు గృహ మంజూరు పత్రాలు అందజేస్తాం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నివాస గృహాలు లేని 199 పేద కుటుంబాలకు ప్రభుత్వం నిర్మించిన గృహాల మంజూరు పత్రాలను బుధవారం అందచేస్తామని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం తెలిపారు. క్యాంపు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా మంగళవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ప్రత్తిపాటికి తమకు ఇంటి స్థలాలు కావాలని, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తమ కుటుంబీకులకు వైద్య సేవల నిమిత్తం ప్రభుత్వం నుంచి సీఎంఆర్ఎఫ్ సాయం అందించాలని కోరుతూ పలువురు ప్రత్తిపాటికి అర్జీలు అందించారు. ఇంటి నిర్మాణానికి జాగా లేని వారికి త్వరలోనే ఉచితంగా స్థలాలు మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఆర్భాటంగా అమలుచేసిన జగనన్న కాలనీలు, సెంటు పట్టాల పంపిణీలోని అవకతవకల్ని సరిచేసి, అర్హులకు న్యాయం చేస్తుందన్నారు. టిడ్కో గృహాలు పొందిన లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండకుండా నిరుపయోగంగా ఉంచిన వారి రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు చెప్పారు. వాటిని అర్హులైన ఇతరులకు కేటాయించనున్నట్టు తెలిపారు. నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్‌లెటర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళా

● 372 మంది ఉద్యోగాలకు ఎంపిక

నరసరావుపేట టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేసానుపల్లిలో ఏపీఎస్ఎస్‌డీసీ, ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్తంగా ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా నిరుద్యోగులకు గొప్ప అవకాశం అన్నారు. నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు మాట్లాడుతూ విద్యార్హతతో పాటు సాఫ్ట్ స్కిల్స్, టెక్నికల్ స్కిల్స్ ఉన్నవారికి ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 38 ప్రముఖ కంపెనీలు ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొన్నాయన్నారు. ఎంపీడీవో రత్నకుమారి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ షేక్ ముజీర్ ప్రసంగించారు. జాబ్‌మేళాకు వివిధ కళాశాల నుంచి 1456 మంది హాజరు కాగా 372 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్‌లెటర్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, 38 కంపెనీల ప్రతినిధులు, హెచ్‌ఆర్ మేనేజర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి గణపవరంలో సీసీఐ పత్తి కొనుగోళ్ళు

● మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా

నాదెండ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభిస్తున్నట్టు చిలకలూరిపేట మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా మంగళవారం తెలిపారు. గణపవరంలోని వెంకటకృష్ణ ఎంటర్ ప్రైజెస్ కంపెనీలో నిర్వహించే ఈ కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా పాల్గొంటారని తెలిపారు. సీసీఐ కనీస మద్దతు ధర క్వింటాకు 8,110గా నిర్ణయించిందని వివరించారు. పత్తిని అమ్మదలచిన వారు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాల్లో ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ కాపీలు అందించాలన్నారు. కపాస్ కిసాన్ యాప్‌లో స్లాటు బుక్ చేసుకొని పత్తి కొనుగోలు కేంద్రానికి తీసుకు రావాలని వివరించారు. ఆయనతో పాటు వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, కార్యదర్శి తిరుపతి రాయుడు ఉన్నారు.



వినుకొండ గ్యారేజీ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

డీఎం వైఖరిపై ఈయూ నాయకుల నిరసన

వినుకొండ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ వినుకొండ డిపో మేనేజర్ వైఖరికి నిరసనగా ఎంప్లాయీస్ యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో ఆర్టీసీ గ్యారేజీ గేటు వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు యూనియన్ నాయకులు మాట్లాడుతూ డిపో మేనేజర్ నిరంకుశ ధోరణితో ఉద్యోగుల సమస్యలను పెడచెవిన పెడుతున్నారని ఆరోపించారు. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు చిన్న చిన్న పొరపాట్లకు పనిష్మెంట్ ఇవ్వడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కాలం చెల్లిన బస్సులను రోడ్డు మీదకు పంపిస్తూ, బస్సులు మధ్యలో ఆగిపోతే మెకానిక్‌లకు పనిష్మెంట్ ఇవ్వడం, సమస్యలపై వెళ్లిన యూనియన్ ప్రతినిధులను చిన్నచూపు చూడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నెల్లూరు జోనల్ అసిస్టెంట్ సెక్రటరీ కే.హరిబాబు, పల్నాడు జిల్లా కోశాధికారి ఎం.పాపయ్య, అధ్యక్షులు విన్సెంట్, కార్యదర్శి సాంబశివరావు, గ్యారేజీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఎస్కే జానీ, మధుబాబు, దిబ్బయ్య, బాజీ, సైదులు, ఎస్ఎస్ఎన్ రెడ్డి, పి.శ్రీనివాసరావులతోపాటు మరో వందమందికి పైగా ఉద్యోగులు పాల్గొన్నారు.